అమర సైనికులకు కొవ్వొత్తులతో నివాళి

నివాళులర్పిస్తున్న సామాజిక కార్యకర్తలు

మంథని, జూలై 26: మంథనిలోని అంబేద్కర్ చౌరస్తాలో మంథనికి చెందిన సామాజిక కార్యకర్తలు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరులైన భారత సైనికులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించి, సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు.

ఇల్లు కూలిన బాధితులకు న్యాయం చేయాలి

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు.

కోల్‌సిటీ, జూలై 26 : సింగరేణి ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3లో బ్లాస్టింగ్‌ల ప్రభావానికి గోదావరిఖని విఠల్‌నగర్‌లోని నిరుపేద దళిత కుటుంబం నివసిస్తున్న ఇల్లు కూలి రోడ్డున పడ్డారని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దెల దినేశ్ తెలిపారు. శుక్రవారం బాధిత కుటుంబంను పరామర్శించి కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితులకు యాజమాన్యం సంస్థ క్వార్టర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి



సింగరేణి సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, జూలై 26: 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి లాభాల్లో 35శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని సింగరేణి ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం కంపెనీ ఆర్జించిన పన్ను తర్వాత లాభాల్లో 32శాతం వాటాను ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహకంగా చెల్లించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా లాభాలు రానున్నాయని, ఉద్యోగులు, సిబ్బందికి ప్రోత్సాహకం కింద నికర లాభాల్లో కనీసం 35శాతం వాటాను ఈ ప్రభుత్వం ద్వారా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు వంగ వెంకట్, తదితరులున్నారు.

కుక్కల బెడద నివారణకు చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, జూలై 26 : నగరంలో కుక్కల బెడద నివారణకు సత్వర చర్యలు తీసుకోవడంతోపాటు రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలిస్తామని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. ఈమేరకు కార్యాలయంలో శుక్రవారం యానిమల్ బర్త్ కంట్రోల్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ వాక్సిన్ వేయించాలని కోరారు. నగర పాలక సంస్థ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన వీధి కుక్కల శస్త్ర చికిత్స కేంద్రాన్ని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా, తిలక్‌నగర్ చౌరస్తాలో రోడ్లపై తిరుగుతున్న పశువుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. సమావేశంలో నగర పాలక సంస్థ సెక్రెటరీ రాజు, డిస్ట్రిక్ట్ వెటర్నరీ అండ్ యానిమల్ హస్బెండరీ ఆఫీసర్ రామస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సునీల్, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్, సునీల్ రాథోడ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ మధూకర్, హాండ్స్ టు సర్వీస్ ఫౌండేషన్ ప్రతినిధులు అరవింద్ స్వామి, సునీల్ కుమార్ ఉన్నారు.

వృత్తి శిక్షణ అభ్యర్థులకు పరీక్ష

మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని, జూలై 26: సింగరేణి ఆర్జీ-1 సేవాసమితి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత పథకం కింద నిరుద్యోగ మహిళ, యువతులకు గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన 18 వృత్తి శిక్షణ తరగతులు పూర్తి చేసిన అభ్యర్థులకు శుక్రవారం ఆర్జీ-1 కమ్యూనిటీ హాల్‌లో హైదరాబాద్ ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం ద్వారా పరీక్ష నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన 500 మంది పరీక్షకు హాజరయ్యారు. ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ, శిక్షణ కోర్సు పరీక్ష రాసిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల మహిళలు పాల్గొన్నారు.

ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన ఫయాజ్

పెద్దపల్లి రూరల్, జూలై 26: బదిలీల్లో భాగంగా పెద్దపల్లి ఎంపీవోగా పని చేసిన సుదర్శన్ పాలకుర్తికి బదిలీ కాగా ఆయన స్థానంలో సుల్తానాబాద్ ఎంపీవోగా పనిచేసిన ఎండీ ఫయాజ్ బదిలీపై పెద్దపల్లికి వచ్చారు. గురువారం ఫయాజ్ పెద్దపల్లి ఎంపీవోగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టగా ఆయనకు సంబంధిత శాఖాధికారులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ ఎంపీవోగా పనిచేసి పాలకుర్తికి బదిలీపై వెళ్తున్న సుదర్శన్‌కు వీడ్కోలు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీవో గుణ్ణాల శ్రీనివాస్‌గౌడ్‌ను ఎంపీవో ఫయాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ ఉపాధిటెక్నికల్ అసిస్టెంట్ల సంఘం నాయకులు వెంకటేశంగౌడ్ ఉన్నారు.

రెయిన్ కోట్ల అందజేత

కమాన్‌పూర్, జూలై 26 : మండల పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, కారోబార్లకు, పంపు డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, ఆపరేటర్లు 21 మందికి సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, లయన్స్‌క్లబ్ సభ్యులు బోనాల వెంకటస్వామి ఫౌండేషన్ ద్వారా రెయిన్‌కోట్లు అందజేశారు. శుక్రవారం తహసీల్దార్ అరీఫొద్దీన్ చేతుల మీదుగా వాటిని కార్మికులకు అందజేశారు. ఇక్కడ కార్యదర్శి ప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు లక్ష్మణ్, లింగయ్య, చంద్రశేఖర్, నగేశ్, అరవింద్ తదితరులున్నారు.

29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్ర

గోదావరిఖని, జూలై 26: తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి నేరుగా కేటాయించాలని, వేలం పాటను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎం ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగ్ర సభ్యుడు ఎస్ వీరయ్య తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్న బస్సుయాత్రను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం ప్రారంభిస్తారన్నారు. యాత్ర వచ్చే నెల ఆగస్టు 5 వరకు ఎనిమిది రోజుల పాటు కొనసాగి కొత్తగూడెంలో ముగింపు సభ ఉంటుందన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జూలై 26: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 5వతరగతి చదువుతున్న 800 మంది విద్యార్థులకు పులి నాగమణి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు పులి ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. తన తల్లి జ్ఞాపకార్థం 32 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశామన్నారు. ఇక్కడ మాజీ సర్పంచ్ తులా మనోహర్‌రావు, నాయకులు రానవేన శ్రీనివాస్, పాల రాజేశం, జంపయ్య, కారుపాకల రమేశ్ తదితరులున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో అధికారుల పరిశీలన

ముత్తారం, జూలై 26: పొలానికి వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయాలని ముత్తారం మండలం కేశనపల్లి రైతు పరికిపండ్ల రాజమల్లు ఇటీవల మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ శ్రీహర్షకు విన్నవించాడు. స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఎస్సారెస్పీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. దీనిపై నివేదికను కలెక్టర్‌కు అందజేసి త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఈఈ బలరామయ్య, డీఈ రాజేంద్రనాథ్, ఏఈ సమ్యుద్దీన్,వర్క్‌ఇన్‌స్పెక్టర్ రమేశ్ ఉన్నారు.

ఆవులను రోడ్లపై వదిలి పెట్టద్దు

మంథని, జూలై 26: పట్టణంలోని ఆవులను యజమానులు ఇష్టానుసారంగా రోడ్ల మీదకు వదిలి పెట్టవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమా సురేశ్‌రెడ్డి, కమిషనర్ గుట్టల మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులను ఇష్టానుసారంగా రోడ్ల మీదకు విడిచి పెట్టడం వల్ల రోడ్లు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి రోడ్ల మీద తిరిగే ఆవులను ఇతర ప్రాంతాలకు తరలిస్తామన్నారు.

విద్యుత్ షాక్‌తో బర్రె మృతి

కాల్వశ్రీరాంపూర్, జూలై 26 : మండలంలోని చిన్నరాతిపల్లిలో రాజుకు చెందిన బర్రె శుక్రవారం కరెంట్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.30వేల విలువ ఉంటుందని బాధితుడు తెలిపాడు.

సర్వారంలో ఎద్దు..

ముత్తారం, జూలై 26: మండలంలోని సర్వారం గ్రామ రైతు నెత్తెట్ల కొమురయ్య ఎద్దు విద్యుద్ షాక్‌తో శుక్రవారం మృతి చెందింది. ఎద్దు సహాయంతో రైతు పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుత్ స్తంభం సపోర్ట్ వైర్‌కు ఎద్దు తగలడంతో షాక్ కు గురై మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వ పరంగా సహాయం అందించాలని కోరాడు.

జీఎంకు ఘన సన్మానం

గోదావరిఖని, జూలై 26: ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ జీఎం కే గురువయ్యను శుక్రవారం ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఆర్జీ 1 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముందస్తు వీడ్కోలులో ఆర్జీ-1 జీఎం పూలమాల వేసి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఇక్కడ జీఎం సేఫ్టీ ఆర్జీ రీజియన్ గుప్తా, ఏరియా సేఫ్టీ అధికారి బైద్య, ఇంజినీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, ఏజీఎం శివనారాయణ, ఏజెంట్లు బానోతు సైదులు, చిలుక శ్రీనివాస్, ధనలక్ష్మిబాయి, చంద్రశేఖర్, ఆంజనేయప్రసాద్, ఆంజనేయులు, జితేందర్‌సింగ్, వెంకటరమణ, ప్రభాకర్, శ్రీనివాస్, హరిప్రసాద్, వీరారెడ్డి ఉన్నారు.

కార్మిక కుటుంబాలకు వైద్యసేవలందించాలి

గోదావరిఖని, జూలై 26: సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐలో వైద్య సేవలందించాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ పేర్కొన్నారు. శుక్రవారం ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ కమల్ కిశోర్‌ను న్యూఢిల్లీలో కలిసిన సీఎండీ వినతిపత్రం అందజేసి విన్నవించారు. స్పందించిన ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటుతోపాటు అవసరం మేరకు దవాఖానల మార్పునకు హామీ ఇచ్చినట్లుగా సింగరేణి సీఎండీ పేర్కొన్నారు.

మాకు న్యాయం చేయండి

- కేటీఆర్‌ను కలిసిన ఆర్జీ-1 క్వార్టర్ల కూల్చివేత బాధితులు

జ్యోతినగర్, జూలై 26: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అరాచక పాలన చేస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని బాధితులు కేటీఆర్ ముందు ప్లకార్డులతో వారి బాధలను మొరపెట్టుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేపట్టిన మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే బృందంతో కలిసి పర్యటనకు విచ్చేసిన కేటీఆర్‌ను శుక్రవారం ఉదయం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని జ్యోతిక వీఐపీ గెస్ట్ హౌస్‌లో సింగరేణి ఆర్జీ-1లో యాజమాన్యం చేపట్టిన క్వార్టర్ల కూల్చివేత బాధితులు కలిసి సమస్యను విన్నవించారు. ఇటీవల 82 క్వార్టర్లకు కరెంట్, నీళ్లు కట్‌చేసి రామగుండం ఎమ్మెల్యే ఇబ్బందులకు గురి చేశారన్నారు. 70 ఏండ్లుగా ఏ ప్రజాప్రతినిధులు ఇలాంటి పనులు చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ తమకు జరిగిన అన్యాయంపై అసెంబ్లీలో చర్చించాలని కేటీఆర్‌ను వారు వేడుకున్నారు.

బాధితుల సమస్యలను కేటీఆర్‌కు వివరిస్తున్న బీఆర్ఎస్ నేత తోట వేణు

కేటీఆర్ పర్యటనలో బీఆర్ఎస్ నాయకులు

మంథని/మంథని రూరల్, జూలై 26: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మేడగడ్డ పర్యటనలో మంథని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పాల్గొన్నారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డలో పర్యటిస్తుండగా మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్, ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నాయకులు మర్వాద పూర్వకంగా కలుసుకున్నారు. తరలి వెళ్లిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, గోనె శ్రీనివాస్‌రావు, ఆరెపల్లి కుమార్, ఎక్కటి అనంతరెడ్డి, కనవేన శ్రీనివాస్, బండ రవి, ఆయూబ్‌ఖాన్, ఆజ్మీరా సమ్మన్నలున్నారు.

మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద మంథని బీఆర్ఎస్ నాయకులు

ప్రీ స్కూల్ నిర్వహణపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 26: అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్న నేపథ్యంలో ప్రీ స్కూల్ విధుల నిర్వహణపై అంగన్ వాడీ టీచర్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జల్ద అరుణ శ్రీతోకలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాస్టర్ ట్రైనర్లు క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ టీచర్ల విధి నిర్వహణను పరిశీలించి ప్రభుత్వ లక్ష్యాలు అమలవుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ప్రక్రియ 15 రోజుల్లో పూర్తిచేసి క్షేత్రస్థాయిలో వంద శాతం ప్రీస్కూల్ సమర్థవంతంగా నడిచేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, సీడీపీవో కవిత, సంబంధిత అధికారులున్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం నిర్వహణ, ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య, తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జల్ద అరుణ శ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని 100 పడకల మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం ద్వారా గర్భిణులకు మరింత మెరుగైన వైద్య సేవలందించాలని, ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. ఇక్కడ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత వైద్యాధికారులు, తదితరులున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సఖీ వన్ స్టాప్ సేవలపై విస్తృత ప్రచారం చేయాలి

పెద్దపల్లి రూరల్, జూలై 26: సఖీవన్ స్టాప్ కేంద్రం ద్వారా అందించే సేవలపై గ్రామాలు పట్టణాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీల నిర్వహణ జరగాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల శివారులో కలెక్టరేట్ ఎదురుగా గల సఖీ వన్ స్టాప్ కేంద్రం, పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడలోగల అంగన్‌వాడీ కేంద్రం, బాలరక్షభవన్, రంగంపల్లిలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సఖీ వన్‌స్టాప్ భవన నిర్మాణ పనులను గురువారం స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, అధికారులతో కలిసి సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ రకాల వేధింపులపై అవసరమైన సహాయాన్ని అందించేందుకు సఖీ వన్ స్టాప్ కేంద్రం కృషి చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక విద్యాకేంద్రాలుగా పని చేయాలన్నారు. సఖీ కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రంగంపల్లిలోని బీసీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖాధికారి రౌఫ్ ఖాన్, పెద్దపల్లి సీడీపీవో కవిత, బాల రక్షభవన్ అధికారి సుగుణ, సఖీ కేంద్రం కో ఆర్డినేటర్ దారవేని స్వప్న, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు ఘన నివాళి

జ్యోతినగర్, జూలై 26: సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, కేంద్ర, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్ ఇటీవల జరిగిన అకాల మృతితో శుక్రవారం ఎన్టీపీసీలోని మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో సంతాప సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నిశాళి అర్పించారు. ఇక్కడ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సీపీఐ ఎంఎల్ అంతర్గాం మండల కార్యదర్శి వెంకన్న, కల రమేశ్, జిల్లా నాయకులున్నారు.

కార్మికుల ప్రాణాలతో చెలగాటం

రామగిరి, జూలై 26 : కార్మికుల ప్రాణాలతో హెచ్‌డీ కంపెనీ యాజమాన్యం చెలగాటమాడుతుందని మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఓసీపీ ప్రాజెక్టులో కాంట్రాక్ట్ కార్మికుడు ప్రమాదానికి గురై కళ్లకు తీవ్ర గాయాలైన సంఘటన యాజమాన్యం నిర్లక్ష్యమేనన్నారు. ప్రమాదం జరిగి 24 గంటలైనా సింగరేణి యాజమాన్యం స్పందించడం లేదన్నారు. కార్మికునికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆందోళన చేపట్టారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

పెద్దపల్లి టౌన్, జూలై 26: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు భూషణవేని సురేశ్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపైన చిన్నచూపు ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఇక్కడ నాయకులు బోడ్డుపల్లి శ్రీనివాస్, బండారి సునిల్, దోడ్డుపల్లి జగదీశ్, కొండి సతీశ్, సురేందర్, కౌన్సిలర్లు భూతగడ్డ సంపత్, తాడురి పుష్పకళ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఓదెల, జూలై 26: వర్షాల వల్ల కలిగే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న సూచించారు. శుక్రవారం ఓదెల మండల కేంద్రంలో ఆమె పర్యటించారు. గ్రామంలో వీధుల వెంట తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. వెంట డాక్టర్ షహబాజ్‌ఖాన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

పెద్దపల్లి కమాన్, జూలై 26 : యువత చెడు వ్యవసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పెద్దపల్లి సీఐ ఆర్ కృష్ణ పిలుపునిచ్చారు. రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ ఆదేశాల మేరకు పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం గంజాయి, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇక్కడ రూరల్ ఎస్ఐ మల్లేశ్, కళాశాల ప్రిన్సిపాల్ మణి గణేశ్, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

- బీజేపీ నాయకులు

పెద్దపల్లి టౌన్, జూలై 26: తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెద్దపల్లి జిల్లాకు అన్యాయం జరిగిందని బీజేపీ పట్టణాధ్యక్షుడు కావేటి రాజగోపాల్, మండలాధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం కమాన్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు మేకల శ్రీనివాస్ మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రజలు ఎన్నో యేండ్లుగా ఎదురు చూస్తున్న బస్ డిపో గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా కనీస చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోగా, ఎన్నికల హామీలపై మాట్లాకపోవడం ప్రజలను మోసం చేయడమేనని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో పెద్దపల్లి జిల్లాకు నిధులు కేటాయించకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇక్కడ నాయకులు కావేటి రాజగోపాల్, సంపత్ రావు, శ్రీకాంత్, రాకేశ్, సతీశ్, రాజు, బాబు, ఉమేశ్, వంశీ, రాజం మహంతకృష్ణ, తదితరులున్నారు.

పెద్దపల్లి కమాన్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అర్హులందరికీ లక్షలోపు రుణమాఫీ

కమాన్‌పూర్/రామగిరి, జూలై 26 : తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ కింద విడుదల చేసిన నిధులను బ్యాంకర్లు జమ చేసుకొని భవిష్యత్ అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకర్లతో రుణమాఫీ, రైతులకు మళ్లీ రుణాల మంజూరుపై చర్చించారు. మండలంలోని పలు విత్తన, ఎరువుల, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రొంపికుంటలో రైతులతో ముఖాముఖి చర్చలు జరిపారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రుణమాఫీ పథకానికి వినియోగించాలని ఎట్టి పరిస్థితిలో ఇతర అప్పులకు జమ చేసుకోవద్దని సూచించారు. రుణమాఫీ ఫిర్యాదుల విభాగానికి మండల వ్యవసాయ అధికారిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమార్, ఏఈవో అజ్మీరా సురేశ్ నాయక్, కేడీసీసీ మేనేజర్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- పెద్దపల్లి ఆర్డీవో బొడ్డుల గంగయ్య

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం బొంపల్లిలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న పెద్దపల్లి ఆర్డీవో బొడ్డుల గంగయ్య

పెద్దపల్లి రూరల్, జూలై 26: గ్రామాల్లో మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి బొడ్డుల గంగయ్య అన్నారు. పెద్దపల్లి మండలంలో బొంపల్లి, మేరపల్లి గ్రామాల్లో పర్యటించారు. అవెన్యూ ప్లాంటేషన్‌పై అధికారులు, గ్రామస్తులను అడిగి తెలుసుకుని, పనులను పరిశీలించారు. మేరపల్లి అంగన్‌వాడీ